
సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



ఎన్నికలు వచ్చే.. ఉపాధి తెచ్చే

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరుగుతున్న ప్రచారాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు వివిధ రంగాల్లోని వారికి ఉపాధి కల్పిస్తున్నాయి. - 8లో▸



డెల్టాకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,100 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
43.0° / 25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	43.0	25.0
కాకినాడ	39.0	28.0
అమలాపురం	41.0	27.0

న్యూస్‌రీల్

నేడు డాక్టర్ గూడూరి నామినేషన్



విలేకర్లతో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా సోమవారం నామినేషన్ వేయనున్నట్లు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం దివాన్ చెరువు నుంచి ర్యాలీ గా కలెక్టరేట్‌కు బయలుదేరుతామన్నారు. ఉద యం 10.45 గంటలకు పార్టీ బి-ఫారంతో పాటు మూడు సెట్ల నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారికి అందజేస్తానని చెప్పారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారానే వై నాట్ 175 నినాదంతో అన్ని ఎమ్మెల్యే, 25 ఎంపీ స్థానాలు గెలుచుకుని తీరుతా మని ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యక్ష నగదు బదిలీ విధానం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో ఏకంగా రూ.4.78 లక్షల కోట్లు నేరుగా జమ చేశారని గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 12 శాతంగా ఉన్న పేదరికాన్ని 4.8 శాతానికి సీఎం జగన్ తగ్గించగలిగారని చెప్పారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలను ఆధునీకరించి, ఇంగ్లిష్ మీడియం, టోఫెల్ విద్యా విధానం అమలు చేశారని, ఆరోగ్యశ్రీ పథకం చికిత్స పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం ద్వారా ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందేలా భరోసా ఇచ్చారని చెప్పారు. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన రాజమహేంద్రవరం నగరాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడంతో పాటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం, ఐటీ హబ్, మెడికల్ టూరిజం వంటి రంగాల్లో అభివృద్ధి చేయడం తన ప్రధాన లక్ష్యమని డాక్టర్ గూడూరి శ్రీనివాస్ చెప్పారు. విలేకర్ల సమావేశంలో ఏపీఐడీఈసీ డైరెక్టర్ కానుబోయిన సాగర్, వైఎస్సార్ సీపీ నేత నందెపు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు పోలు విజయలక్ష్మి, గూడూరి రాధిక, పాలసాన పల్లి హనుమంతరావు, మానే దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ ఉత్తేజం.. అక్కడ నిస్తేజం



ఇంటింటా ప్రచారంలో ప్రభుత్వం చేపట్టిన మంచిని వివరిస్తున్న రాజమండ్రి ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్



ప్రజలతో మమేకమవుతున్న డాక్టర్ గూడూరి



రాజానగరం ఆత్మీయ సమావేశంలో టీడీపీ నేతలు ఫ్లెక్సీ చించేస్తుంటే కిమ్మనకుండా కూర్చున్న పురందేశ్వరి

- గడప గడపకూ గూడూరితో ప్రజల్లోకి..
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా తనదైన ముద్ర
- ఎమ్మెల్యే అభ్యర్థులతో సమన్వయం
- ప్రచారంలో ఫ్యాన్ జోరు
- బీజేపీ అభ్యర్థి పురందేశ్వరికి నిరసన సెగలు
- అంతర్గత కుమ్ములాటలు
- క్యాడర్‌లో నిస్తేజం

సాక్షి, రాజమహేంద్రవరం: ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వం సరైన దిశానిర్దేశం చేయడం.. నాయకుల్లో ఐక్యత, సమన్వయం, ఆత్మవిశ్వాసం.. కష్టసుఖాల్లో ప్రజలతో మమేకమై, వారి వెంట ఉండటం.. ఐదేళ్ల సంక్షేమ, అభివృద్ధి పాలనపై కనిపిస్తున్న జనాదరణ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పట్ల వారిలో నానాటికీ ఇనుమడిస్తున్న అభిమానం.. వీటినే ప్రధానాస్త్రాలుగా చేసుకుని రాజమహేంద్రవరం లోక్‌సభ ఎన్నికల బరిలో వైఎస్సార్ సీపీ ఉత్తేజంతో ముందుకు సాగుతోంది.

అదే సమయంలో సిద్ధాంతాలు పక్కన పెట్టి.. అధికారమే పరమావధిగా.. అత్యంత ప్రజాదరణ పొందిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గద్దె దించడమే లక్ష్యంగా.. అనైతిక పొత్తులు కట్టడం ద్వారా తెచ్చుకున్న తలనొప్పులు.. పరస్పర విభేదాలు.. సహాయ నిరాకరణలు.. అసంతృప్తులు.. నిరసన సెగలతో కమల దళం నిస్తేజంతో సతమతమవుతోంది.

మరోసారి బీసీలకు కేటాయించిన వైఎస్సార్ సీపీ

రాజమండ్రి లోక్‌సభ స్థానాన్ని బీసీ సామాజిక వర్గానికి కేటాయించిన దాఖలాలు చరిత్రలో ఎప్పుడూ లేవు. తొలిసారి గత ఎన్నికల సమయంలో అటువంటి సాహసోపేత నిర్ణయాన్ని వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారు. 2019 ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన మార్గాని భరత్‌రామ్‌కు అవకాశం కల్పించగా.. ఈసారి బీసీ శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. దీనిపై బీసీ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. డాక్టర్ గూడూరి రాజమండ్రి నుంచి 18వ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. జాతీయ పార్టీలకు చెందిన పురందేశ్వరి, గిడుగు రుద్రరాజుతో తలపడనున్నారు. అయితే, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఈసారి కూడా రాజమండ్రి పార్లమెంటరీ స్థానంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం తథ్యమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

గడప గడపకూ వెళ్తూ..

రాజమండ్రి లోక్‌సభ స్థానంలో మరోసారి ఫ్యాన్ గిరగిరా తిరగాలన్నదే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తనదైన శైలిలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సౌమ్యుడిగా, ప్రముఖ వైద్యుడిగా, అందరికీ పరిచయస్తుడిగా జిల్లా వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు గడించిన ఆయన ప్రచారంలో దూసుకుని వెళ్తున్నారు. పార్లమెంటరీ స్థానం పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులతో సమన్వయం చేసుకుంటున్నారు. వారితో పాటు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఎంపీ అభ్యర్థిగా తన పేరు ఖరారైన నాటి నుంచే అలుపు లేకుండా ప్రజల్లోకి వెళుతున్నారు. పార్టీ రాజమండ్రి సిటీ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించిన సమయంలో సైతం ఆయన ఇక్కడ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. లోక్‌సభ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రస్తుతం అదే పంథా కొనసాగిస్తున్నారు. ప్రతి గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గడప గడపకూ వెళ్తూ ప్రతి కుటుంబాన్నీ ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. గడచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఇప్పటి వరకూ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు. గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు అందుతున్న సేవలను వారి దృష్టికి తీసుకుని వెళ్తున్నారు. వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేసుకుంటే రాష్ట్రానికి జరిగే మేలును వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. దీనికి ప్రజల్లో విశేష స్పందన లభిస్తోంది. డాక్టర్ గూడూరి ప్రచారానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారు. అన్ని వర్గాల వారితో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లోనూ డాక్టర్ గూడూరి తన ప్రచారం పూర్తి చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో మూడు నాలుగు విడతలకు మించి పూర్తి చేశారు కూడా.

పట్టు లేక.. పురందేశ్వరి సతమతం

బీజేపీ నుంచి రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి టీడీపీ, జనసేన మద్దతుతో పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఆమెకు ఆదిలోనే అసమ్మతి సెగ ఎదురైంది. పార్టీ నేతలతో సమన్వయం కుదరక సొంత కుంపటి పెట్టుకున్నారు. ఈ పరిణామం పార్టీ కేడర్‌పై పడింది. బీజేపీ సీనియర్ నేత సోము వీర్రాజు, ఆయన వర్గీయులు పురందేశ్వరికి దూరమయ్యారు. టీడీపీ, జనసేన నేతలు సైతం సహకరిండం లేదు. కొద్ది రోజుల కిందట రాజానగరంలో నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఆత్మీయ సమావేశంలో అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి వర్గీయులు ప్రధాని మోదీ, చంద్రబాబు, పురందేశ్వరి ఉన్న ఫ్లెక్సీలను చించివేశారు. ఈ పరిణామం ఆమెలో మరింత నిరాశ నింపింది. రాజమహేంద్రవరం వచ్చినప్పటి నుంచి నేటి వరకూ ఆమె ఆత్మీయ సమావేశాలు, చంద్రబాబు, పవన్‌తో బహిరంగ సభల్లో పాల్గొనడం తప్ప.. ఇంటింటా ప్రచారానికి వెళ్లిన దాఖలాలే లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు ఆశించిన స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేసే కేడర్ బీజేపీకి లేకపోవడం మైనస్‌గా మారింది. టీడీపీ, జనసేన శ్రేణులైనా తనకు మద్దతుగా ఉంటారనుకుంటే.. చంద్రబాబు, పవన్ నిర్ణయాలతో ఇరు పార్టీల నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇలాంటి సందర్భంలో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిని ఆమె ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పురందేశ్వరి నామినేషన్ వేసినప్పటికీ ప్రచారానికి వెళ్లలేని దుస్థితి నెలకొంది. దీనికి తోడు ఆమె స్థానికురాలు కాదని, ఓట్లేసి గెలిపిస్తే తమ సమస్యలు చెప్పుకొనేందుకు ఎక్కడికి వెళ్లాలనే ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోంది. అదే స్థానికుడైన వైఎస్సార్ సీపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించుకుంటే ఆ సమస్య ఉండదని వారు భావిస్తున్నారు.

ఎన్నికల వ్యయంపై ప్రత్యేక దృష్టి

- ప్రజలకు ఇబ్బంది లేకుండా వ్యవహరించాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్



సమావేశంలో మాట్లాడుతున్న నీనా నిగమ్

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల వ్యయంపై సంబంధిత అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు నీనా నిగమ్ ఆదేశించారు. ఎన్నికల సంబంధిత అంశాలపై సమన్వయ కమిటీలు, నోడల్ అధికారులతో కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన దృష్ట్యా తనిఖీలు ముమ్మరం చేయాలని, సాధారణ పౌరులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల ఖాతాలకు ఖర్చులు చూపేలా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు. జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ప్రణాళికపై సంతృప్తి వ్యక్తం చేశారు. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల అభ్యర్థులు, గుర్తింపు పొందని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల ప్రచార ఖర్చులు, బహుమతుల పంపిణీ, ఇతర ఖర్చులపై దృష్టి పెట్టాలని సూచించారు. వాటిపై అభ్యర్థులకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, ముఖ్యంగా భారీ మొత్తంలో జరిగే వాటిపై, నగదు డిపాజిట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మద్యం అమ్మకాలు, షాపులకు వెళ్లే సరకు రవాణాపై నిరంతర నిఘా ఉండాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణ, ప్రచారం తనిఖీలు ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. పత్రికలు, చానళ్లు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అనుకూల, ప్రతికూల కథనాలు, చెల్లింపు వార్తలు తదితర అంశాలపై నీనా నిగమ్ అడిగి తెలుసుకున్నారు. నగదు, బహుమతులు, మద్యం పంపిణీని నిరోధించేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. జీఎస్‌టీ అంశం పైనే కాకుండా, ఓటర్లకు పంపిణీ చేసేందుకు పెద్ద మొత్తంలో వస్తువులు కొనుగోలు చేస్తున్నారనే విషయంపై కూడా దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత వివరించారు. ఆడిటింగ్ అధికారుల ద్వారా ఖర్చులను ఎప్పటికప్పుడు ఆడిట్ చేస్తున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ, జిల్లాలో 16 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, డీఆర్‌ఓ జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయికి స్వర్ణ కిరీటం సమర్పణ



సాయినాథునికి స్వర్ణకిరీటం అలంకరించిన భక్తులు

యానాం: స్థానిక శివాలయం ఆవరణలో కొలువైన శ్రీ షిర్డీ సాయినాథుడికి ఆదివారం యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వర్ణకిరీటాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రూ.25 లక్షల విలువచేసే 320 గ్రాముల స్వర్ణకిరీటాన్ని సాయినాథునికి అలంకరించారు. అనంతరం షిర్డీ సాయినాథుని సన్నిధిలో విశేష పూజలు నిర్వహించారు. సాయినాథుని 189వ జన్మదినం శ్రీరామ నవమి రోజున జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక వర్తకులు, రైస్ మిల్లర్లు, భక్తుల సహకారంతో సుమారు మూడు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. శ్రీ షిర్డీ సాయి ధార్మిక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఆరోపణలు నిరూపించే దమ్ముందా?

- నిరూపిస్తే జిల్లా వదిలి వెళ్లిపోతా..
- పవన్ కల్యాణ్‌కు జక్కంపూడి గణేష్ సవాల్
- ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివారని విమర్శ
- తమ కుటుంబం గురించి చిరంజీవిని అడిగితే చెప్తారని హితవు



విలేకర్లతో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్

సాక్షి, రాజమహేంద్రవరం: తాము బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లు నడుపుతున్నామంటూ చేసిన ఆరోపణలు నిరూపించే దమ్ము జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు ఉందా అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ప్రశ్నించారు. తాడితోట సంహిత కన్వెన్షన్ హాలులో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోరుకొండలో శనివారం రాత్రి జరిగిన సభలో పవన్ కల్యాణ్ తనపై నిరాధార ఆరోపణలు చేయడం బాధ కలిగించిందన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివేసి వెళ్లిపోయారని దుయ్యబట్టారు. తనపై ఆరోపణలను ఆధారాలతో సహా నిరూపిస్తే తన తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహం వద్ద సాష్టాంగ నమస్కారం చేసి, తనవల్ల ఇబ్బంది పడిన బాధితులకు క్షమాపణ చెప్పి మరీ జిల్లాను వదిలేసి శాశ్వతంగా వెళ్లిపోతానని సవాల్ విసిరారు. కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద నార్కో పరీక్షకు సైతం సిద్ధమని అన్నారు. ఒకవేళ నిరూపించకపోతే వాళ్లేం చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తన తండ్రి రామ్మోహనరావు సమున్నత ఆశయంతో రాజకీయాలు నడిపారని, వాటిని కొనసాగించేందుకే తాము రాజకీయాల్లోకి వచ్చాం తప్ప ఆస్తులు కూడబెట్టుకునేందుకు కాదన్నారు. జక్కంపూడి కుటుంబం ఎలాంటిదో మీ అన్న చిరంజీవిని అడిగి తెలుసుకోవాలని పవన్‌కు హితవు పలికారు. అంతేగాని 420 అయిన బత్తుల బలరామకృష్ణను పక్కన పెట్టుకుని విమర్శలు చేయడం దారుణమని గణేష్ అన్నారు. బ్లేడ్ బ్యాచ్‌కు సంబంధించి రాజానగరం, కోరుకొండ, సీతానగరం పోలీసు స్టేషన్లలో తనపై ఒక్క కేసయినా నమోదైందా? తాను ఎవరికైనా గంజాయి అలవాటు చేసినట్లు, బ్లేడ్ బ్యాచ్‌తో దాడి చేయించినట్లు, బెట్టింగుల్లోకి దింపి ఆస్తులు రాయించుకున్నట్లు ఎక్కడైనా ఎవరైనా ఫిర్యాదు చేశారా అని ప్రశ్నించారు. పవన్ గాడాల వచ్చి బెట్టింగ్ బిల్డింగ్స్ ఎక్కడున్నాయో చూపించి ఆయన చేసిన ఆరోపణలను పవన్ కల్యాణ్ నిరూపించాలని గణేష్ సవాల్ విసిరారు. రాజానగరం జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ దంపతులు జపాన్, ఆస్ట్రేలియాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతను మోసం చేశారని, ఈ మేరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని చెప్పారు. ఉన్నత కుటుంబానికి చెందిన మేడా గురుదత్త ప్రసాద్‌కు టికెట్టు ఇవ్వకుండా 420 బత్తులకు ఇవ్వడం ద్వారా జనసేన ఎలాంటి సంకేతాలు ఇస్తోందని ప్రశ్నించారు. మహిళలపై బత్తుల బ్యాచ్ చేస్తున్న అరాచకాలను ఆధారాలతో సహా చూపిస్తామని గణేష్ చెప్పారు.

పదిలమేనా!

- నేడు పదో తరగతి ఫలితాల విడుదల
- జిల్లాలో పరీక్షలు రాసింది 30,116 మంది



టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం) పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సోమవారం ఉదయం విడుదల చేయనున్నారు. విద్యార్థి దశలో ఎదుర్కొన్న తొలి పబ్లిక్ పరీక్షలు కావడంతో అందరి దృష్టీ ఈ ఫలితాల పైనే ఉంది. ఈ ఫలితాల కోసం జిల్లాలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ప్రజాప్రతినిధులు లేకుండానే.. ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ దేవానంద రెడ్డి ఉదయం 11 గంటలకు విజయవాడలో పదో తరగతి ఫలితాలు విడుదల చేయనున్నారు.

22 రోజుల్లో విడుదల

పదో తరగతి పరీక్షలు 2022 వరకూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో నిర్వహించేవారు. గత విద్యా సంవత్సరం నుంచి కొత్త జిల్లాల వారీగా నిర్వహించారు. ఈసారి కూడా నూతన జిల్లాల వారీగానే మార్చి 18 నుంచి 30వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా 137 కేంద్రాల్లో 30,116 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. ఒక్కో పరీక్షను 100 మార్కుల చొప్పున ఐదు పేపర్లు, పీఎస్, బయాలజీ 50 మార్కుల చొప్పున నిర్వహించారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా అన్ని పరీక్షలకూ బుక్‌లెట్ విధానం అమలు చేశారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ప్రతి పేపర్‌పై క్యూఆర్ కోడ్, ఏడంకెల సిరీస్‌లో నంబర్ ముద్రించారు. ఈ నూతన విధానం మాస్ కాపీయింగ్ నిరోధానికి ఎంతో ఉపకరించింది. పరీక్ష కేంద్రాలను ఈసారి నో మొబైల్ జోన్లుగా ప్రకటించి పూర్తి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ పరీక్షలు పూర్తి చేశారు. ఇవి పూర్తయిన 22 రోజుల్లో ప్రభుత్వం ఫలితాలు విడుదల చేస్తోంది. ఈ నెల ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకూ జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించారు. ఈ ప్రక్రియ పూర్తయిన 13 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేస్తుండటం విశేషం.

పక్కా ప్రణాళిక ప్రకారం

పదో తరగతి పరీక్షల్లో జిల్లా గత ఏడాది కన్నా మెరుగైన ఫలితాలు సాధించే దిశగా విద్యాశాఖ అధికారులు ఈసారి ప్రణాళిక ప్రకారం పని చేశారు. గత ఏడాది జిల్లావ్యాప్తంగా 22,465 మంది టెన్త్ పరీక్షలు రాయగా 15,798 మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో జిల్లా 16వ స్థానంలో నిలిచింది. దీనిని మెరుగుపరచే దిశగా విద్యాశాఖ అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించారు. దీనిని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి, తగు సూచనలు చేసేవారు. విద్యార్థులకు నెలవారీ పరీక్షలు, గ్రేడ్ పరీక్షలు నిర్వహించి, వారి ప్రగతిని పరిశీలించేవారు. నమూనా పబ్లిక్ పరీక్షలు కూడా నిర్వహించారు. ఇవి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయి. సబ్జెక్టు టీచర్లు, ప్రధానోపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు మరింత ఉత్సాహంగా టెన్త్ పరీక్షలకు సిద్ధమయ్యారు. అలాగే, విద్యాశాఖ అధికారులు విద్యార్థులు పరీక్షలకు ఏవిధంగా సిద్ధమవుతున్నారు, ఇంటి వద్ద ఎలా చదువుతున్నారనే అంశాలపై తల్లిదండ్రులను కలసి స్వయంగా పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో ఈసారి మరింత మెరుగైన స్థానం సాధిస్తామని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన ఫలితాలు వస్తాయి



పదో తరగతిలో గత ఏడాది కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాం. వారిలో పబ్లిక్ పరీక్షలు అనే భయాన్ని పోగొట్టాం. చదివితే ఏదీ కష్టం కాదనే విశ్వాసం తీసుకువచ్చాం. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చెప్పిన ప్రణాళిక ప్రకారం ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులు చదివారు. జిల్లాలోని విద్యా శాఖ యంత్రాంగమంతా కష్టపడింది. మంచి ఫలితం కోసం వేచి చూస్తున్నాం.

– కె.వాసుదేవరావు, జిల్లా విద్యాశాఖాధికారి

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న మైనర్ల అరెస్ట్

గండేపల్లి: గంజాయి తరలిస్తున్న మైనర్ బాలురను అరెస్ట్ చేసినట్టు గండేపల్లి ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు ఎన్టీఆర్ జిల్లా పెనమలూరు మండలం, గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు గంజాయి తాగుడుకు బానిసలై తునిలో గుర్తుతెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసిన కేజీ గంజాయిని స్కూటీ డిక్కీలో పెట్టుకుని విజయవాడ వైపు వెళుతున్నారు. మండలంలోని తాళ్లూరు శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు వీరిద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కె.గంగవరం: మండల పరిధిలోని కుందూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల శ్రీనివాసరావు(27) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా ముసునూరు మండలం ముసునూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ప్యాసింజర్ ఆటోపై పుణ్యక్షేత్రాల దర్శనానికి ఆదివారం ఉదయం బయలుదేరాడు. అప్పనపల్లిలో స్వామివారి దర్శనం అనంతరం పంటుపై ముక్తేశ్వరం నుంచి కోటిపల్లి వచ్చి శ్రీ ఛాయా సోమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి బయలుదేరి వెళ్తుండగా కుందూరు వచ్చే సరికి తాడిగొయ్యి నుంచి వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయే క్రమంలో ఆటో తిరగబడింది. ఆటోలో ఉన్న శ్రీనివాసరావు కిందపడడంతో తలపై బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కె.గంగవరం ఎస్సై జానీ బాషా సిబ్బందితో కుందూరు చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

గొల్లప్రోలు: మోటార్ సైకిల్‌పై వెళుతూ డివైడర్‌ను ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన చేబ్రోలు గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్సై బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం కట్టమూరు చెందిన నాగిరెడ్డి వెంకన్నబాబు ఆదివారం కట్టమూరు నుంచి చేబ్రోలులో గల సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద బంధువుల ఫంక్షన్‌కు వెళుతుండగా మధ్యాహ్నం చేబ్రోలు హైవేపై కళ్లు తిరిగి మోటార్ సైకిల్ డివైడర్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయం అయింది. అటుగా వెళుతున్న సీఐ శ్రీనివాసరావు ఆగి వెంటనే 108 అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలు వచ్చే.. ఉపాధి తెచ్చే

- పూలు మొదలు వాహనాల వరకు గిరాకీ
- ఫొటో, వీడియోగ్రాఫర్లు బిజీ బిజీ
- హోటళ్లకు పెరిగిన తాకిడి
- కళాకారులకు, ప్రింటింగ్ ప్రెస్‌లకు డిమాండ్


సౌండ్ సిస్టమ్స్


కార్లు



ప్రింటింగ్ మిషన్

కాకినాడ సిటీ/రాయవరం: ఎన్నికలంటే ర్యాలీలు, సభలు, సమావేశాలు, ప్రచారాలు, పరోక్షంగా వివిధ వృత్తిదారులకు ఉపాధిని కల్పిస్తున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక పూర్తవ్వడంతో ఎవరికి వారుగా విభిన్న రకాలుగా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. వీరి ప్రచారం మరికొందరికి ఉపాధి కల్పిస్తోంది. షెడ్యూల్ ఇచ్చినప్పటి నుంచి ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ప్రచారాలు ముమ్మరంగా ప్రారంభించడంతో పాటు ఈ నెల 18న నామినేషన్ దాఖలు మొదలు, విజయోత్సవ ర్యాలీల వరకు జన సమీకరణతో ముడిపడి ఉండటంతో ఆయా వర్గాలకు వేసవికాలంలో ఉపాధి లభిస్తోంది. ఓటర్లను ఆకట్టుకోవాలంటే బరిలో నిలిచిన అభ్యర్థులు పోటాపోటీగా సందడి చేయాల్సిందే.

డప్పు కళాకారులకు ఆదరణ

ఎక్కడ ఏ ర్యాలీ, సభలు, సమావేశాలు, ఏదైనా కానీ వీరు ఉండాల్సిందే. అభ్యర్థులు గల్లీలో ప్రచారానికి వెళ్లినప్పుడు వీరి ముందు డప్పుచప్పుళ్ల బృందం వారు నృత్యాలు చేస్తూ ప్రచారానికి జోష్ తీసుకొస్తారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలోనూ వీరు భాగమయ్యారు. ఈ డప్పు కళాకారులకు బృందంలోని సభ్యుల సంఖ్యను బట్టి రోజుకు రూ. 3 వేల నుంచి రూ. 5 వేలు చెల్లిస్తున్నారు. ఎన్నికల సమయంలో చేతినిండా పని దొరుకుతోందని వీరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టెంట్‌హౌస్, మైకులకు గిరాకీ

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వీరి పరిధి ఎక్కువగా ఉండటంతో అభ్యర్థులందరూ మండల కేంద్రాల్లో చిన్నచిన్న సమావేశాలు ఏర్పాటుకే మొగ్గు చూపుతున్నారు. ఇలా ఏర్పాటు చేసిన సభలకు టెంట్‌లు, కుర్చీలు సమకూర్చుతూ కొంతమంది ఆదాయం ఆర్జిస్తున్నారు. సమావేశంలో మాట్లాడటానికి మైకులు, లౌడ్‌స్పీకర్లు సమకూర్చుతూ మరికొంతమంది ఉపాధి పొందుతున్నారు. ఏదైనా పెద్ద నాయకులు ర్యాలీ చేసిన సందర్భంలో డీజేలను తప్పక ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలా పలు రకాలుగా వీటికి ఎన్నికల సందడితో గిరాకీ పెరిగినట్లు వాటి నిర్వాహకులు చెబుతున్నారు.

పూలకు పెరిగిన డిమాండ్

అభ్యర్థులు, ప్రచారానికి వచ్చే నాయకులకు పూల దండలు వేయడానికి కార్యకర్తలు పోటీ పడుతుంటారు. ప్రచారంలో అభ్యర్థులపై పూల వర్షం కురిపిస్తున్నారు. పూల వ్యాపారానికి గిరాకీ పెరిగింది. బంతిపూలు, గులాబీ దండల ధర పెరిగిపోయింది. ఒక్కో దండ సుమారు రూ.300 పలుకుతుంది.

పుట్టుకొస్తున్న సోషల్ మీడియా టీములు

అభ్యర్థులు తాము పాల్గొన్న సమావేశాలు, ప్రచార ఫొటోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయటానికి, అలాగే తమ పార్టీ గుర్తించి, మేనిఫెస్టోల గురించి సోషల్ మీడియాలో తెలపటానికి అభ్యర్థులు సోషల్ మీడియా టీములను ఏర్పాటు చేసుకున్నారు. దీనికోసం కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువకులను ఎంపిక చేసుకొని వారిని తమ మీడియా టీంగా ఎంపిక చేసుకుని నియమించుకుంటున్నారు. ఎప్పటికప్పుడు నేతల వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేయడమే వీరి బాధ్యత. దీనికి గానూ వీరికి కొంత వేతనం చెల్లిస్తున్నారు. ఈ విధంగా ఎన్నికలు ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తూ ఆదాయ మార్గంగా మారాయి.

బంకుల్లో బారులు

ప్రచార సమయంలో కార్యకర్తలతో నేతలు బైక్ ర్యాలీలు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలను సమీకరించి వాటిలో పెట్రోలు కొట్టిస్తున్నారు. అలాగే నేతల వెంట తిరిగే ముఖ్య నాయకులు, కార్యకర్తల వాహనాలలో బంకుల్లో పెట్రోలు కోసం బారులు కనబడతాయి.

బోనస్‌గా మద్యం

ఎన్నికలంటేనే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. చిన్నపాటి సమావేశం, ర్యాలీ తీయాలంటే భారీగా జనాన్ని సమీకరించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో జన సమీకరణ చేసి, వారికి కార్యక్రమం పూర్తి కాగానే రూ.300 భత్యం ఇవ్వటంతో పాటు, అదనంగా బీరు, క్వార్టర్ మందు పంపిణీ చేస్తారు. దీంతో సమావేశం జరిగిన ప్రాంతంలో ఆ రోజు మద్యం అమ్మకాలు విపరీతంగా జరుగుతాయి. మద్యం షాపులు పక్కనే ఉన్న మిర్చిబండిల వారి అమ్మకాలు కూడా జోరుగా కొనసాగుతాయి.

ప్రింటింగ్ ప్రెస్ కళకళ

ఇప్పుడు ఎక్కడ ఏ చిన్న సమావేశం జరిగినా అక్కడ నాయకులు, అభ్యర్థుల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సర్వసాధారణమై పోయింది. అభ్యర్థులు తమ పార్టీ గుర్తుతో ఫ్లెక్సీలను కూడళ్లలో ఉండేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. కరపత్రాలు ముద్రించి ఓటర్లకు పంచుతున్నారు. దీంతో ప్రింటింగ్ ప్రెస్‌లు ప్రచార సామగ్రి తయారులో బిజీబిజీగా ఉన్నాయి.

కళకళలాడుతున్న జిరాక్స్ సెంటర్లు

ఎన్నికల వేళ జిరాక్స్ సెంటర్లకు గిరాకీ ఏర్పడింది. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఎత్తుగడలు వేస్తుంటారు. ఓటరు జాబితా సేకరించి తదనుగుణంగా ప్రణాళిక రచిస్తారు. అధికారుల నుంచి ఓటరు జాబితాను సేకరించి పదుల సంఖ్యలో జిరాక్స్ తీస్తుంటారు. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగింపుతో ఈ ప్రక్రియ మరింత ఊపందుకుంది.

హోటల్స్ ఫుల్

సభలకు, ప్రచారాలకు సమీకరించిన జనాలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందజేయడం తప్పనిసరి. దీంతో నాయకులు దగ్గరిలోని హోటళ్లకు వెళ్లి ఆర్డర్ ఇస్తున్నారు. టోకెన్లు తీసుకొని వచ్చి జనాలకు పంచుతున్నారు. దీంతో ఎన్నికల ఆర్డర్లతో హోటల్స్ కిటకిటలాడుతున్నాయి.

రవాణా సౌకర్యం

అభ్యర్థులతో పాటు నాయకులు, కార్యకర్తలను ఇతర ప్రాంతాలకు తీసుకుని వెళ్లడానికి వాహనాలను సమకూర్చుతారు. ఒక్కో వాహనం అద్దె రోజుకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు యజమానులకు సమకూరనుంది. అధిక సంఖ్యలో వాహనాలు మండల కేంద్రాల్లో పట్టణాల్లో తిరగాల్సి ఉండడంతో ఇంధన వినియోగం పెరిగే అవకాశముంటుంది. ఇదే కాకుండా అభ్యర్థుల ప్రచార ఫ్లెక్సీలు పెట్టుకుని ఆటోలు, వ్యాన్‌లు తిప్పుతుంటారు.

ప్రచారానికి టీ షర్టులు

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల పేర్లు, చిత్రాలతో టీ షర్టులను ముద్రించి యువకులకు పంపిణీ చేస్తుంటారు. ఏ వీధిలో చూసినా అభ్యర్థి పేరు మార్మోగాలని ఇదొక రకం వ్యూహంగా అభ్యర్థులు భావిస్తుంటారు. ఒక్కో టీ షర్టు ధర రూ.150 నుంచి రూ.250 వరకు ధర పలుకుతుంది. ఈ విధంగా వేలాది టీ షర్టులు ముద్రించే అవకాశముంటుంది. ఈ లెక్కన వీటికే రూ.లక్షల్లో ఖర్చు చేసే అవకాశముంది.

కూలీలకు డిమాండ్

గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం చేపట్టే సమయంలో కూలీలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఒక్కో కూలీకి టిఫిన్, భోజనం పెట్టి రూ.500 వరకు చెల్లించే అవకాశముంది. అభ్యర్థులు తమ పట్టును నిరూపించుకునేందుకు ర్యాలీలు చేస్తుంటారు. అలా ర్యాలీలు చేసే సందర్భాలు, ప్రచారం చేసే సమయంలో తమ పట్టును చూపించుకునేందుకు జన సమీకరణ చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో జన సమీకరణలో భాగంగా కూలీలను వినియోగిస్తుంటారు.

రైలు బోగీలో గుర్తు తెలియని వృద్ధుడి మృతి


గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం

నిడదవోలు : రైలు బోగీలో గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందడంతో ఆదివారం జీఆర్‌పీ పోలీసులు మృతదేహన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్సై జి. శ్రీహరిబాబు తెలిపిన వివరాల మేరకు..తిరుపతి నుంచి పూరి వెళుతుతున్న ఎక్స్‌ప్రెస్ వికలాంగుల బోగీలో గుర్తు తెలియని వృద్ధుడు చనిపోవడాన్ని ప్రయాణికులు గుర్తించారు. ఈ విషయాన్ని లోకో పైలెట్ దృష్టికి తీసుకువెళ్లారు. లోక్ పైలెట్ నిడదవోలు రైల్వేస్టేషన్ మాస్టర్‌కి సమాచారం ఇచ్చారు. నిడదవోలు రైల్వే స్టేషన్‌కి శనివారం రాత్రి 11 గంటలకు పూరి ఎక్స్‌ప్రెస్ చేరుకుంది. వికలాంగుల బోగిలో గుర్తుతెలియని సుమారు 60 ఏళ్ల వృద్ధుడు మృతిచెందినట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. బోగీలో నుంచి మృతదేహాన్ని దించి నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నలుపు, తెలుపు సన్నని ఛారలు ఉన్న చేతుల చొక్కా, మాసిన పసుపు రంగు లుంగీ, నీలం రంగు టవల్ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల కోసం 9490617090, 7013360296 సెల్ నంబర్లలో సంప్రదించాలని రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు తెలిపారు.

దాడుల్లో 14 మంది అరెస్ట్

తనిఖీల్లో రూ.6.86 లక్షల నగదు సీజ్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలీసు శాఖ, ఎస్ఈబీ, ఎస్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, నిఘా బృందాలు పలు చోట్ల దాడులు, తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ రవాణాకు బ్రేకులు వేస్తున్నాయి. జిల్లాలో శని, ఆదివారాల్లో నిర్వహించిన దాడులు, తనిఖీల్లో 14 మందిని అరెస్ట్ చేయడంతో రూ.6.86 లక్షల నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఈ నిఘా బృందాలు పనిచేస్తున్నాయి. ఈ వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం ఆదివారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

- ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి 6 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 57 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 12.28 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- రామచంద్రపురం, ద్రాక్షారామ, మండపేట రూరల్, మండపేట పట్టణం, అంగర పోలీసు స్టేషన్ల పరిధిలో పలు వాహనాలను తనిఖీ చేసి రూ.6.86 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.
- ద్రాక్షారామ, మండపేట టౌన్ పోలీసు స్టేషన్ల పరిధిలో నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 2 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 10 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 4.43 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం, రాజోలు, ఆలమూరు, రామచంద్రపురం, కొత్తపేట, ముమ్మిడివరం ఎస్ఈబీ స్టేషన్ల పరిధిలో ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 3 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 45 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 11.79 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేటల్లో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల్లో ఆదివారం కూడా వాహనాలను ఆపి విస్తృత తనిఖీలు చేశారు.
- ఎన్నికల్లో సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ బూత్‌ల్లో ప్రజలు నిర్భయంగా ఓట్లు వేసే దిశగా జిల్లాలోని పలుచోట్ల పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో ఆదివారం సాయంత్రం కవాతు నిర్వహించారు. అమలాపురం పట్టణం బ్యాంక్ స్ట్రీట్, ఎస్‌కేబీఆర్ కళాశాల రోడ్డు, గడియారం స్తంభం సెంటర్, ఐ.పోలవరం మండలం కొమరిగిరి, ద్రాక్షారామ మండలం హసన్‌బాద్, ఉండూరు, కందులపాలెంలో కవాతు జరిగింది.


కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పిఠాపురంలో టీడీపీ, జనసేనకు ఎదురుదెబ్బ

- వైఎస్సార్ సీపీలో చేరిన 200 మంది రెండు పార్టీల నేతలు
- కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత


వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నేతలు

పిఠాపురం: టీడీపీ, జనసేనకు పిఠాపురంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆయా పార్టీల నుంచి 200 మంది టీడీపీ, జనసేన నేతలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం తన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజల నుంచి అసాధారణ రీతిలో స్పందన కనిపిస్తోందన్నారు. ప్రతిపక్షాల నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీలోకి చేరుతూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారని ఆమె అన్నారు. రెండురోజుల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్ యాత్రగా ఇక్కడ చేసిన పర్యటన నేపథ్యంలో పార్టీలో మరింత జోష్ పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, న్యాయవాది విజయ్‌కుమార్, వజ్రపుబాబీ, బత్తిన రాజశేఖర్, జానీ, రాజీవ్, అభి, చందు, అఖిల్ పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు 146 మంది గైర్హాజరు


హంసవరంలో ప్రవేశ పరీక్షను పర్యవేక్షిస్తున్న స్టేట్ అబ్జర్వర్ శ్రీలత, ప్రిన్సిపాల్ పద్మజ

తుని రూరల్: తుని మండలం హంసవరం ఏపీ మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)లో ఆరో తర గతి ప్రవేశ పరీక్షకు 146 మంది అభ్యర్థులు హాజరుకాలేదని చీఫ్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ పి.పద్మజ ఆదివారం తెలిపారు. ఆన్‌లైన్‌లో 409 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. 263 మంది (64శాతం) అర్హత పరీక్ష రాశారన్నారు. స్టేట్ అబ్జర్వర్ సీహెచ్ శ్రీలత పరీక్ష కేంద్రాన్ని సందర్శించి, మాల్ ప్రాక్టీస్ జరగకపోవడం, మౌలిక సదుపాయాలు కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా వి.పద్మజ, అడిషనల్ ఆఫీసర్‌గా సత్యనారాయణ పాల్గొన్నారు.

నవ దంపతులకు ఉచితంగా సత్యదేవుని అంతరాలయ దర్శనం

అన్నవరం: నవ దంపతులకు శుభవార్త. సత్యదేవుని దర్శనానికి విచ్చేసే నవ దంపతులకు స్వామివారి అంతరాలయ (స్పెషల్) దర్శనం ఉచితంగా చేయించనున్నట్టు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదివారం తెలిపారు. వీరు ఎటువంటి ప్రత్యేక రుసుం చెల్లించకుండా స్వామివారి అంతరాలయ దర్శనం చేసుకోవచ్చునని ఈఓ తెలిపారు.

ఘనంగా సదస్యం


స్వామివారికి సదస్యం నిర్వహిస్తున్న వేద పండితులు


ప్రత్యేక అలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి క్షేత్రం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వేకువ జామునే గ్రామోత్సవం నిర్వహించారు. వేద పండితులు ఖండవల్లి రాజేశ్వర వర ప్రసాద్ అచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు పాల్గొని వేద పారాయణ చేశారు. సుప్రభాత సేవ, బాలభోగం, విష్వక్సేన పూజ, వేద పారాయణం, నివేదన, బలిహరణ, కార్యక్రమాలను వేద పండితులు, అర్చక స్వాములు వేద మంత్రాల పఠనతో నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలను ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ అందించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. స్వామివారిని ఆభరణాలతో అలంకరించి మిరమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పవళింపు సేవ నిర్వహించారు. ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. సోమవారం తెప్పోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో తెలిపారు.

వాహనాల తనిఖీలో రూ.లక్ష స్వాధీనం


సామర్లకోట మండలం ఉండూరు బ్రిడ్జి వద్ద నగదు స్వాధీనం చేసుకున్న టీము సభ్యులు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.1.01,000 స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె. సీతారామారావు తెలిపారు. సామర్లకోట మండలం ఉండూరు బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్కు పోస్టు వద్ద టీము అధికారి కె.వెంకటరాజు గుప్తా తనిఖీ చేసిన సమయంలో వాహన యజమాని ఆర్.శైలజ వద్ద నగదు కు సంబంధించిన రికార్డులు లేక పోవడంతో ఆ నగదు స్వాధీనం చేసుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపగా దానిని కాకినాడ ట్రెజరీకి జమ చేసినట్టు సీతారామారావు తెలిపారు.

రత్నగిరిపై పెళ్లి సందడి


సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న నవ దంపతులు, భక్తులు

- వందలాది మంది నవ దంపతులతో ఆలయ ప్రాంగణం కళకళ
- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం వేలాదిగా తరలి వచ్చిన భక్తులు, నవదంపతులు, వారి బంధుమిత్రులతో ఆదివారం కిక్కిరిసి పోయింది. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున రత్నగిరిపై వందకి పైగా వివాహాలు జరిగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న వారు కూడా స్వామివారి ఆలయానికి తరలి రావడంతో ఆలయంలో ఎక్కడ చూసినా నవదంపతులే దర్శనమిచ్చారు. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లు, వ్రత మంటపాలు, విశ్రాంత మంటపాలు నవ దంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిసిపోయాయి. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. స్వామివారి దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.